# నేరం నాదీ - శిక్ష నీదీ

"అయ్యా! కాఫీ తీసుకురమ్మంటారా?" అన్నాడు రంగన్న ఆఫీసు నుంచి అప్పుడే వచ్చిన రాజాతో.

"వద్దు రంగన్నా! అలమారులో వున్న విస్కీ సీసా తీసుకురా! ఇదిగో ఈ నోటు తీసుకెళ్ళి ఓ డజను సోడాలు, నాలుగు సిగరెట్ పేకెట్‌లు పట్రా చూడు, ఉత్తరాలేమయినా వచ్చాయా?" అన్నాడు రాజా యాభై రూపాయల నోటు బంట్రోతుకు అందిస్తూ.

"బల్లమీద పెట్టేను బాబూ! రెండు వచ్చినాయి". అని ఉత్తరాలని అందిచ్చి బజారుకి వెళ్ళిపోయాడు రంగన్న.

బట్టలు మార్చుకు వచ్చిన రాజా కళ్ళజోడు పెట్టుకుని ఆ ఉత్తరాలని చూడసాగాడు. ఒకటి కార్డు, రెండోది కవరు. ఎడ్రసు చూస్తూ ఆ ఉత్తరాన్ని చింపేడు, ఆ ఉత్తరం ఎవరు రాసిందో కాదు. అతని భార్య సునీత రాసిందే తీసి ఓ పేజీ చదవగానే అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

శ్రీవారికి నమస్కారాలు.

ఇల్లు విడిచి నేనూ, పిల్లాడూ వచ్చేసిన రెండు నెలల తరువాత మీకు ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను. మీతో మాట మాత్రంగానైన చెప్పకుండా నేనూ, పిల్లాడూ ఎందుకొచ్చేశామో మీకు తెలుసు. పెళ్ళయిన నాలుగేళ్ళల్లోనే మనం విడిపోవలసి వచ్చింది. మిమ్మల్ని మార్చాలని ఎంతో ప్రయత్నించి, ప్రయత్నించి విఫలురాలనయ్యాను. ఎంతో ఓర్మి, సహనంతో ఆ ఇంట్లో నిలబడి మిమ్మల్ని బాగుచేసుకోవాలని ఎంతో ప్రయాసపడ్డాను. కాని ఓ విధంగా ఓడిపోయాననే చెప్పాలి. ముఖ్యంగా మిమ్మల్ని బాగుచెయ్యలేక పోవడం మాట అటుంచి, ఆ ఇంటి ఆడపిల్ల, మధుతో లేచిపోవడం నా జీవితం మీదే పెద్ద దెబ్బ తీసింది. లోకులు కాకులు. నలుగురూ అనే మాటల్ని వింటూ ఇక నేనా ఇంట్లో నిలబడలేక పోయాను.

"ఇంట్లో తల్లి వుంటే ఆ పిల్లనలా తిరగ నిచ్చేదా? మొగుడు వ్యసనపరుడన్న కోపంతో ఆడబిడ్డని చూసీచూడనట్లు ఊరుకుందని తిరిగి వచ్చింది. ఈడొచ్చిన పిల్లకి పెళ్ళి చెయ్యకపోతే లేచిపోకేంచేస్తుంది? వదినకేం పట్టింది? తల్లి గనకనా?" అనీ నలుగురూ అనే మాటల్ని సహించలేకపోయాను. అన్నగారు ఎంత వ్యసనపరుడైనప్పటికీ లోకం పట్టించుకోదు. ఇంట్లో ఆడదాన్నే నలుగురూ నిందిస్తారు. ఇంట్లో అన్న జూదం ఆడుతూ, తాగుడు తాగుతూ, ముండలతో మైమరచి తిరుగుతూ వుంటే మీ చెల్లెలికి కూడా ఆ నిషాయే ఎక్కి నే చెప్పిన మాటలు, చేసిన హితబోధ రుచించక చేదుగా వుండేది. దాని ఫలితంగా నిత్యం మీతో పాటు తాగి, పేకాడి తిరిగే మీ స్నేహితుడు మధు మీ చెల్లెల్ని లేవదీసుకుపోయాడు. దానికి కారణం మీరే అయినా లోకం నాపైనే వేలెత్తి చూపించి నిందిస్తోంది. ఇక ఆ నిందల్ని భరించలేక ఆ నరకకూపంలో నిలబడలేక ముఖ్యంగా నాపిల్లాడి జీవితాన్ని మంచి మార్గంలో మలచాలన్న దృష్టితోటి, ఆ ఇంట్లో మీ మధ్య పెరిగితే మీ బుద్ధులే వస్తాయన్న భయంతోటి, వాడిని తీసుకొని మీకు దూరంగా వచ్చేశాను. భగవంతుని దయవల్ల ఓ అయిదువందల జీతం గల ఉద్యోగాన్ని సంపాదించుకోగలిగాను. నేనూ నా పిల్లాడు సామాన్యంగా బ్రతకడానికా జీతం సరిపోతుందని నానమ్మకం. మీ ఇంట్లోలా ఆడంబరంగా పెంచలేకపోయినా, నిరాడంబరంగా కట్టుదిట్టంగా మాత్రం పెంచగలను. నేను మీదగ్గర నుంచి ఏమీ ఆశించి మాత్రం ఈ వుత్తరాన్ని వ్రాయటంలేదు. చివరిగా ఒక మనవి మాత్రం చేస్తున్నాను. చెడిపోయిన వాళ్ళనేకమంది బాగుపడుతూ వుంటారు. ఒకసారి చెడిపోయిన వాళ్ళు ఎల్లకాలం చెడుగానే వుండరు. అటువంటి మంచిరోజు మీజీవితంలో వస్తే ఆనాడు నా ఇంటి తలుపులు మీ కోసం తెరిచివుంటాయి అంతదాకా సెలవు.

ఇట్లు

సునీత

తను ఆశించిన విధంగా లేదా వుత్తరం.

"హు - వ్యసనపరుడినట - వ్యసన పరుడు, నాకు బుద్ధివచ్చిన రోజు దాని

కాళ్ళు పట్టుకోడానికి నే వెళ్లాలిట. పల్లెటూరు బైతు, మూర్ఖురాలు ఒక్కసారి ఈ గొడ్డుని విదేశాల్లో తిప్పి తీసుకొస్తే డ్రింకుల్ని తాగుడనీ, స్వేచ్ఛగా కోరిన వారిని అనుభవించే వారిని ముండల ముఠాకోరనీ మొరటుగా అని వుండేది కాదు. విదేశీయులు ఎంత స్వేచ్ఛగా బ్రతుకు బ్రతుకుతారు. ఛీ-ఛీ- మనదేశంలో ఇంకా మూఢనమ్మకాలుపోలేదు. ఎందుకు? చదివింది ఎమ్.ఏ లోకజ్ఞానం లేనివాళ్ళు ఎమ్.ఏ చదివినా ఒకటే చదవకపోయినా ఒకటే. అన్‌సివిలైజుడు ఉమన్. నా చెల్లెలు నా వల్ల లేచి పోయిందిట. దానికిష్టమైన వాడిని అది చూసుకుంది దాని జీవితాన్ని అది ఏర్పరుచుకొంది. విదేశాల్లో మైనారిటీ తీరిన ఆడపిల్లలు వారి భర్తల్ని వారే ఎంచుకుంటారు. అది చేసిన తప్పేమిటో? ఓ పాతిక వేలు కట్నం పోసి దానిని అత్తగారూ, ఆడబిడ్డలూ అన్న కటకటాల్లో కుళ్ళబెట్టలేదనా? చూస్తా. ఎన్నాళ్ళు బ్రతకగలదో? నేనే దాని దగ్గరకి వెళ్తానో? అదే నా కాళ్ళ దగ్గిరికి వస్తుందో? నాకే లోటూ లేదు. నవ్వుతూ విస్కీపోసే బంట్రోతులు, కావాలంటే విస్కీపోసే ఆడది వంటకిమనుష్యులు. ఏ అవసరం కూడా దానిని జ్ఞప్తికి తీసుకురావటం లేదు. అది వెళ్ళిపోవటం వల్ల చెడిపోయేది నేను కాదు. అదే పైగా హాయిగా ఏ అల్లరీ గొడవలూ లేకుండా స్వేచ్ఛగా నిశ్చింతగా నా కోరికలన్నీ తీరుతున్నాయి. అది వున్నన్నాళ్ళూ ఇంట్లో ఏడుపులూ, గొడవలేగా? ఇక మనకి ఇంతే అంటూ సునీత రాసిన వుత్తరాన్ని ఉండగా నలిపి గదిలో మూలకి గిరవాటు వేశాడు.

రంగన్న తెచ్చిన సోడా సీసాల్ని కొన్నింటిని ఫ్రిజ్‌లో వుంచమని రెండు తీసుకుని విస్కీలో పోసుకుని కొద్దికొద్దిగా సిప్ చేస్తూ రంగన్నని జీడిపప్పులు ప్లేట్‌లో పోసుకురమ్మన్నాడు.

వీధి తలుపు చప్పుడయింది. "ఎవరు?" అన్నాడు రాజా.

'నేనండీ జానీని సార్, నమస్కారం సార్. హోటల్ మహేష్‌లో మంచిపరువంలో వున్న పిట్ట వచ్చిందిట సార్! రాత్రికి బుక్ చెయ్యమంటారేమోనని... అడుగుదామని వచ్చాను సార్!" అన్నాడు.

'రేటెంతట? అడిగావా? ఎడ్వాన్సు కావాలా?' అన్నాడు నవ్వుతూ.

"దానికేముంది సార్ మీ తాహతుకి ఎంత రేటైతే ఏమిటి సార్. మరయితే వస్తారా సార్" అని రాజా అందిచ్చిన పచ్చనోటు అందుకుని వెళ్ళిపోయాడు జానీ.

ఖాళీ అయిన సోడాసీసాల్ని, విస్కీబాటిల్‌ని, గ్లాసుని తీసుకెళ్తున్న రంగన్నతో తను రాత్రికి బైటికెళ్తున్నానని, తెల్లారిన తరువాత వస్తానని ఇల్లు చూసుకోమని డ్రస్ చేసుకొడానికి వెళ్ళి పోయాడు రాజా.

సునీత, రాజాల పెళ్ళయి నాలుగేళ్ళయింది. అత్తవారింటికి వచ్చిన ఏడాదికే అత్తగారు గతించారు. కాలేజీలో చేరిన ఆడబిడ్డ తమతో వుండేది. కొంతకాలానికి భర్త దుర్వ్యసనాలన్నీ సునీతకి తెలిశాయి. భార్యాభర్తల మధ్య వాగ్వివాదాలు ప్రారంభమయ్యాయి. రాను రాను ఆ ఇంట్లో కుతర్కం, అల్లర్లూ, గొడవలు ఎక్కువయ్యాయి. భర్త తాగడం, వ్యభిచరించడం, పేకాడటం సునీతకి సుతరామూ ఇష్టం వుండేది కాదు. విదేశాల్లో రెండేళ్ళపాటు పై చదువులకి వెళ్ళిన రాజాకి ఇవన్నీ బాగా అలవాటయి విడలేనిబంధాల్లా తయారయ్యాయి. స్వదేశానికి తిరిగిరాగానే తల్లికోరిక మీద ఉన్నత కుటుంబంలోని పిల్లయిన సునీతని పెళ్ళి చేసుకున్నాడు. తల్లి పోయిన తరువాత ఆ ఇంటికి తనే యజమాని అవడంతో తను స్వేచ్ఛగా తన కోరికల్ని తీర్చుకునే వాడు. ఇంట్లోయుక్త వయసులో వున్న చెల్లెలికి అన్నా, వదినల మధ్య గొడవలన్నీ అర్థమయ్యేవి. ఇంటికొచ్చే స్నేహితులతో అన్నయ్య తాగడం, పేక ఆడటం చూస్తూనే వుండేది. నెమ్మదిగా ఆ ఇంటికొచ్చే మధు అనే అతనితో పరిచయమయింది. అది ప్రేమగా మారింది. దాని ఫలితంగా వదినకీ ఆమెకీ మధ్యకూడా గొడవలు వచ్చాయి. వదిన్ని ఖాతరు చెయ్యలేదు. ఓ రోజు మధుతో వెళ్ళిపోయింది. లోకమంతా సునీతనే ఆడిపోసుకుంది. ఈ సంసారంతో విసిగిపోయిన సునీత తన మూడేళ్ళ కొడుకుని తీసుకుని పుట్టింటికి వెళ్ళింది. చెల్లెలు లేచి పోయిందనిగానీ, భార్య వెళ్ళిపోయిందని గానీ, రాజా విచారించలేదు. తను ఇప్పుడు హాయిగా స్వేచ్ఛగా వున్నాడు. నెలకి మూడువేల రూపాయల జీతం ఎలా ఖర్చుచేసినా ఫరవాలేదు. పెద్ద ఇల్లు నౌకర్లు, చాకర్లు - పైగా స్వేచ్ఛగా కోరిందల్లా తీరుతోంది. డబ్బిస్తే దొరకంది లేదనుకునే తత్వం

రాజాది. ఊరిలోకి కొత్తగా దిగిన వేశ్యనల్లా బ్రోకర్లు, రాజా ఎక్కువ డబ్బివ్వడం వల్ల అతనికే ముందు బుక్ చేస్తాడు. అప్పుడప్పుడు ఇంటికి కూడా తెచ్చుకొంటున్నాడు. డబ్బుకోసం కామవాంఛని తీర్చడానికి వచ్చే వేశ్యలు కొందరు. తమ కామవాంఛని తీర్చుకోవడానికి వచ్చే వాళ్ళు కొందరు. ఎవరి బలవంతం వల్లో వచ్చే వాళ్ళు కొందరు. వీరందరితో కొత్త, కొత్త అనుభవాలు అవుతూ ఉండేవి. జేబులు ఖాళీ చేసే వారు కొందరు. ఈ వృత్తిలోకి ఎలా దిగేరో తమబాధల్ని చెప్పుకునే వారు కొందరు. ఈ బ్రతుకుల్లో ఎంత మగ్గిపోతున్నారో చెప్పి విలపించే వారు కొందరు, బలవంతంవల్ల వచ్చేవాళ్ళు, తొలిసారిగా వచ్చేవాళ్ళూ కాళ్లావేళ్లాపడి తమని ఈ వృత్తిలోకి దింపిన వారి గురించి చెప్పి తమని రక్షించి, దయదలచి వదిలెయ్యమని, మీ సోదరిగా భావించమని ఏడ్చేవాళ్లు కొందరు అన్నీ విని ఓ నవ్వు నవ్వి తన పని కాగానే ముడుపు చెల్లించి వచ్చెయ్యడమే రాజాపని.

భార్య వెళ్ళిపోయి మూడేళ్ళయిపోయింది. మళ్ళీ సునీత దగ్గరనుంచి వుత్తరం లేదు. రాజాకి ఆమె లేనిటోటు లేదు. ఇద్దరి జీవితాలు చెరో బాటలో నడుస్తున్నాయి. రాజా బాట రాజాకి సుఖంగా వుంది. సునీత బాట సునీతకి హాయిగా వుంది. సునీత పట్టుదల గల మనిషి ఆమె పద్ధతులు రాజా బాటకి అడ్డే. అందుకు అతనికి ఆమె లేని జీవితమే బాగుంది. అతను తన జీవితాన్ని విదేశీయులతో పోల్చుకుని ఆనందిస్తాడు. మనదేశం అధః పాతాళంలోనే వుందని అతని భావం. విదేశాలలో ప్రజలు మన దేశీయులు టీ, కాఫీలు తాగినట్లు డ్రింకుల్ని తాగుతారు. ఇంట్లో వున్నంత వరకే భార్య, భర్తల బంధం, బైటికి పోతే ఎవరి ఇష్టం వారిది. కావాలనుకునే వాళ్ళు స్వేచ్ఛగా మరొకరితో తిరగొచ్చు. అటువంటి వాటికి అలవాటు పడ్డ రాజాకి భార్య హితబోధ నచ్చలేదు. పైగా చెల్లెలు చేసింది కూడా తప్పుగా కనపడలేదు. విదేశాల్లోలాగే తన భర్తని తాను ఎన్నుకుంది అనుకున్నాడు రాజా. మనదేశం మారలేదు. ముఖ్యంగా మన స్త్రీలు పురోగమించాలి అనుకుంటాడు రాజా, సునీత కట్టుబాటైన మనిషి. మనహిందూ సాంప్రదాయాల్ని గౌరవించే తత్వం ఆమెది. ఫలితంగా అతకని బ్రతుకులయి విడిపోయారిద్దరూ.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చాడు రాజా. మనస్సు ఈ రోజెందుకో కాస్త చికాగ్గా వుంది. రంగన్న యధాప్రకారం విస్కీసీసా, ఐస్ ట్రే పెట్టి, సోడాసీసా తియ్యబోయాడు. "కాఫీ పట్రా రంగన్నా అవొద్దు" అన్నాడు సోఫాలో వెనక్కి జారగిలబడి. అతని మనస్సెందుకో అల్లకల్లోలంగా వుంది. ఈ రోజు కార్తీక పౌర్ణిమ. తల్లి పోయిన రోజది. తద్దినం పెట్టమనేది సునీత. తనకలాంటి నమ్మకాలు లేవనేవాడు రాజా. 'చచ్చిన వాళ్ళొచ్చి తింటారా?' అని అతని వాదన. కనీసం ఈ ఒక్క రోజు తన దుర్వ్యసనాలనయినా మానమని అర్థించేది. పెడచెవిని పెట్టేవాడు. సునీత వద్దన్న పనిని పదే, పదే చేసి ఆమెని కవ్వించి రెచ్చగొట్టడం ఓ సరదాగా అలవాటు చేసుకున్నాడు. కానీ ఈ రోజు ఎందుకో తనకే తాగాలనిపించడం లేదు తనలో వచ్చిన ఈ మార్పు తనకే ఆశ్చర్యంగా వుంది.

వీధి తలుపు చప్పుడుయింది జానీ వచ్చి సలామ్ కొట్టేడు, "సార్ బొంబాయ్ నుంచి వచ్చిందిట సార్, మీ గురించి అడిగింది సార్! రాత్రికి మిమ్మల్ని రమ్మని చెప్పింది సార్! ఇదివరకు మిమ్మల్ని ఘెరుగున్న పిట్టే అనుకుంటానండి బుక్ చెయ్యమంటారా!" అన్నాడు.

మనస్సంతా అల్లకల్లోలంగా వున్న రాజాకి మాటలు హుషారు కలిగించాయి. ఇంతదాకా మనసులో మెదిలిన ఆలోచనల్ని ఓ పక్కకి నెట్టి జానీకో పచ్చనోటిచ్చి పంపేడు. మరో గంట తరువాత లోపలికెళ్ళి ముఖం కడుక్కుని కారు తీసుకుని బయలు దేరేడు.

హోటల్ మహేష్ ముందు కారు అపగానే బోయ్ సలామ్ కొట్టి కారు తలుపు తెరిచాడు రాజాదిగి డోర్‌లాక్ చేసి హోటల్ యజమాని దగ్గరికి వెళ్ళేడు. అప్పటికే అక్కడ వేచివున్న జానీ చిరునవ్వుతో స్వాగతం పలికాడు. హోటల్ యజమాని దగ్గరకి వెళ్ళిన రాజాని సాదరంగా ఆహ్వానించి సోఫా చూపించాడు. బోయ్‌ని కూల్‌డ్రింక్ తెమ్మని అర్డరిచ్చాడు.

"వద్దు గదిలోకి విస్కీ పంపించండి" అన్నాడు నవ్వుతూ.

"అలాగేసార్" అంటూ ఫోన్ తీసి రాజాకి బుక్ చేసిన మీనా గదికి ఫోన్

చేసి రాజా రాకని తెలియచేశాడు. వెంటనే ఫోన్ పెట్టేసి "పైకి రమ్మన్నారండి స్నానం చేసి వస్తారుట. పదండి సార్!" అని జానీ వైపుకిచూస్తూ "దొరగారిని దింపిరా జానీ" అన్నాడు. లిఫ్టువైపుకి నడుస్తున్న జానీని అనుసరించాడు రాజా. ఆరో అంతస్తులో ఆగింది లిఫ్టు దిగి ఇద్దరూ ఆఖరి గదిలోకి నడిచారు. బాత్‌రూమ్‌లోంచి శబ్దం వస్తోంది. జానీ సలామ్ కొట్టి గది తలుపులు వేసి వెళ్ళిపోయాడు. సోఫాలో కూర్చున్న రాజాకి ఎదురుగా బల్లమీద విస్కీ బాటిల్, రెండు గ్లాసులు, ఐస్ బక్కెట్, ప్లేటులో స్నేక్సు వున్నాయి. మంచి సబ్బు వాసన బాత్‌రూమ్‌లోంచి వస్తోంది. మదించిన వాడికి మత్తెక్కించేలా వుందా సువాసన, మనస్సు స్వాధీనం తప్పుతోంది. సీసాలోంచి విస్కీ పోసుకుని సోడాసీసా తెరిచి పోసుకున్నాడు. నెమ్మదిగా సిప్‌చేసి ప్రక్కనే వున్న స్నేకు నోట్లో వేసుకున్నాడు. బల్లమీద ఏదో ఇంగ్లీషు మేగజైన్ వుంది తీసి పేజీలు తెరిచాడు. అర్ధనగ్నంగా వున్న స్త్రీల ఫోటోలు, వివిధ భంగిమలలో మనస్సుని స్వాధీనం తప్పించేలా వున్నాయా వర్ణ చిత్రాలు. అవి చూస్తూ మూడు గ్లాసులు విస్కీ ఖాళీ చేసేసాడు రాజా. అప్పటికే మనస్సు స్వాధీనం తప్పుతోంది. నాలుగోగ్లాసు అందుకున్నాడు. ఇంతలో బాత్‌రూం తలుపు తెరుచుకుంది మీనాకంటే ముందే పౌడరు, సెంటు వాసనలు గుప్పుమని గదిలోకి ప్రవేశించాయి. సన్నగా పొడుగ్గా వున్న మీనా తెల్లని సిల్కు చీరలో బాత్‌రూంలోంచి బైటికొచ్చింది. మేలిముసుగు, వయ్యారపు నడకతో గదిలోకి ప్రవేసించిన మీనాని చూడగానే పుస్తకాన్ని పక్కకి విసిరి ఆమె దగ్గరకి చేరాడు. అప్పటికే ఫోమ్‌బెడ్ మీద వయ్యారంగా కూర్చున్న మీనాని వాటేసుకోవాలన్న ఆతృతతో భుజాలచుట్టూ చెయ్యివేసి ముసుగును తొలగిస్తూ " ఇదేంకొత్త ఫేషన్?" అన్నాడు. ఆమె పెదాల దగ్గరికి తన పెదాలని తీసికెళ్తూ అంతే షాక్ కొట్టినట్టుగా వెనక్కి పడ్డ రాజాకి విస్కీ మత్తు ఒదిలిపోయింది. నోటమాట రాక కళ్ళు తేలేశాడు మాటలు రాని వాడిలా ఆమెవైపే వెర్రివాడిడా చూస్తూ "మీనాక్షి! నువ్వా? ఏమిటి ఈ పని? నువ్వు వేశ్యవా? నీభర్త మధు ఏడీ ఎందుకిలా తయారయ్యావు?" అంటూ తడబడుతూ ప్రశ్నమీద ప్రశ్న వెయ్యసాగాడు.

ముఖంలో ఏ భావమూ కనబర్చుకోకుండా శాంతంగా రాజావైపు చూసి

"రా దూరంగా వెళ్ళిపోయావేం? నేను ఇప్పుడు మీనాక్షినికాదు. మీనాని వృత్తిలో వున్న ఒక వేశ్యని. కనీసం ఎవరికీ ఉంపుడు గత్తెనన్నా కాదు నీ స్నేహితుడు నన్ను ఉంపుడు గత్తెగానన్నా వుంచుకుని వుంటే నాకీగతి పట్టివుండేది కాదు. వాడుకున్నన్నాళ్లూ వాడుకుని చేతిలో డబ్బు అయిపోయాకా నా చేత ఈ ఉద్యోగం చేయించాడు. నాకీ జీవితం అలవాటవగానే మధు నాకు చెప్పకుండా వెళ్ళిపోయాడు. తనకి బిడ్డ పుట్టబోతోందనయినా ఆలోచించలేదు. మధు చూపించిన బాటనే అనుసరిస్తూ రోజుకో విలాస పురుషుడి చేతిలో నలుగుతూ, రోజుకో వూరిలో, రోజుకో వ్యక్తిని తృప్తిపరుస్తూ నా బిడ్డని పెంచుకుంటున్నాను. ఇప్పుడు ఒక వేశ్యగా, కులటగా, బోగందాని గానే నేను అందరికీ పరిచితురాలిని. దాని ఫలితం చూడు" అని వంటి మీదున్న పైటని తొలగించింది.

కెవ్వున కేకవేసి రెండు చేతులతో కళ్ళని మూసుకున్నాడు రాజా. ఆమెని అంత హీన స్థితిలో చూస్తానని ఊహించలేదు. వికారంగా వుందా శరీరం.

"ఎంత నీచుడా వెధవ"! అన్నాడు ఉద్రేకంతో.

"వాడు కాదన్నయ్యా నువ్వే!" అంది నిరసనగా రాజాని చూస్తూ.

"నువ్వే దీనంతటికీ కారకుడివి, ఇంట్లో ఇల్లాలిని లక్ష్యపెట్టక, నువ్వు అడ్డమైన వాళ్ళతో తిరుగుతూ, పేకాడుతూ, తాగుడు తాగుతుంటే ఇంట్లో యవ్వనంలో వున్న వారి మీద వాటి ప్రభావం ఎలా వుంటుందో ఎప్పుడన్నా ఊహించావా? ఇంటిని ఒక పేకాట క్లబ్బుగా, ఒక బార్‌గా, వేశ్యల కొంపగా తయారుచేసి, విలాస పురుషుడిగా ఆనందించే వాడివేగాని దాని పర్యవసానం ఎలా వుంటుందని ఒకనాడైనా ఆలోచించావా? వదిన చెప్పే హితబోధల్ని కూడా లెఖ్ఖచెయ్యకుండా నీ చెడు మిత్రుడి వలలో పడి నా జీవితాన్ని ఇలా నాశనం చేసుకున్నానంటే కారణం ఎవరు? కూటికోసం ఈ వృత్తిలోకి దిగినా, ఈ నరక కూపంలో పడేబాధ నీకేం తెల్సు? బురదలో కూరుకుపోయిన ప్రాణిలా నలుగురి చేతుల్లో నలిగి పోతున్నప్పుడు నిన్ను తిట్టుకుని, దేవతలాంటి వదినకి చెయ్యెత్తి దణ్ణం పెట్టని రోజంటూ లేదు. ఇదీ నా కథ.

"ఇక నీ సంగతి తెలిసింది. నీలో ఎటువంటి మార్పూ రాలేదని విన్నాను.

నాలాంటి వారి మానాలని దోచుకుంటూ హింసిస్తూ ఇంకా ఆనందిసున్నావనీ, నీ నుంచి వదిన వేరే వెళ్ళిపోయి గౌరవంగా బ్రతుకుతోందని కూడా తెలుసుకున్నాను. అందుకే ఈ రోజు నీకే ప్రత్యేకించి కబురు పంపేను. నీ చెల్లెలు మీనాక్షి ఎప్పుడో చచ్చిపోయింది. నువ్వు బలవంతాన అనుభవించిన స్త్రీలలాంటి దానినే ఇప్పుడు నేనూను. నన్ను చూసి ఆగిపోనక్కరలేదు నీపని కానిచ్చుకో!" అంది దగ్గరగా వస్తూ.

"చెల్లాయ్" అని మీనాక్షిని కౌగలించుకోబోయిన రాజాకి దూరంగా జరిగి ఆగు నా శరీరమంతా మలినం. ఆ పిలుపుతో నన్ను తాకొద్దు ఆ అర్హతను ఏనాడో కోల్పోయాను" అంది.

"అలా అనకు మీనాక్షి! అలా అనకు పద ఇంటికి వెళ్దాం. నీకు మంచి డాక్టర్ చేత వైద్యం చేయిస్తా. నీకేలోటూ లేదు. నా ధనాన్నంతా ఖర్చుచేసి నీకు స్వస్థత చేకూరేలా చేస్తా పదమ్మా ఇంటికి" అన్నాడు.

"హు - అన్నయ్యా దేవత వంటి వదిన్ని ఎంత క్షోభ పెట్టేవో ఒక్కసారి ఆలోచించుకో నన్ను చూసి నువ్వు బాధపడుతున్నట్లే వదిన జీవితాన్ని చూసిన వదిన తల్లిదండ్రులు ఎంతలా విలపిస్తున్నారో ఊహించు. ఆడపిల్లకి పెళ్ళిచేసి మూడు పువ్వులూ, ఆరుకాయల్లా వారి జీవితాలు వృద్ధిలోకి రావాలని ప్రతి కన్యా తన జీవితాన్ని గురించి ఎంతో అందంగా ఊహించుకుని, గాలి మేడలు కట్టుకుని పరవశిస్తుంది. అష్ట ఐశ్వర్యాలూ వున్నా, భర్త వ్యసనపరుడైతే ఆ స్త్రీ జీవితం బూడిదలో పోసిన పన్నీరేకదా? వదిన కూడా అటువంటి నరకాన్నే నీ ఇంట అనుభవించింది. కనీసం ఇప్పుడన్నా కళ్ళు తెరుచుకుని వదినకి చేసిన అన్యాయాన్ని తెలుసుకో, ఏ స్త్రీ కూడా తన భర్త జూదరి, ముండలముతాకోరు, తాగుముచ్చు అంటే సహించలేదు, తలెత్తుకుని నలుగుర్లో తిరగలేదు. విదేశీయులతో మనదేశాన్ని పోల్చి మీ జీవితాలని సర్వనాశనం చేసుకున్నావు. విదేశాల్లో కూడా హిందూ స్త్రీలంటే అపారమైన గౌరవం, ఒక ప్రత్యేకత వుంది ఎవరి పద్ధతి వారిది. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు రెండేళ్ళకి వెళ్ళి వచ్చిన నీలాంటి వాళ్ళు అక్కడి పద్ధతులని ఇక్కడ అమల్లో పెడితే ఇక్కడి స్త్రీల జీవితాలు వదిన జీవితాల్లాగ, నా జీవితాల్లాగ తయారవుతాయి. మన దేశం నా

వంటి స్త్రీని గౌరవించలేదు. వేశ్య, బోగంది, రంకుది అనే పదాలు విదేశీయులు ఉపయోగించరు. ఈ దేశంలో ఒకసారి కాలు జారిన స్త్రీకి ఆ నామధేయాలు సార్థకం. ఇక జీవించినంతకాలం ఆ బిరుదులు శాశ్వతం. మీవంటి వారి వ్యసనాలకి బలి అవుతూ బ్రతకాలే తప్ప వేరే మార్గంలేదు. ఒక్కసారి తప్పుచేసిన స్త్రీ తన జీవితాన్ని ఏ విధంగానూ ఇక సరిదిద్దుకోలేరు. సరిదిద్దుకుందామని ప్రయత్నించినా సరిదిద్దుకోనివ్వరు 'ఒకరి దగ్గర కెళ్ళిన దానివి నాదగ్గరకి రావడానికేం?' అనే కీచకులబారి నుంచి తప్పించుకోలేదు. ఈ విషవలయంలో చిక్కుకున్న వారు సుడిగుండంలో పడ్డ ప్రాణిలా కొట్టుకోవలసిందే మర్యాదగా బ్రతకాలని నలుగుర్లోకి వెళ్ళబోతే బుగ్గలు నొక్కుకుని, వెటకారమాడి, చీడపురుగుల్ని చూసినట్లు చూసి అసహ్యంచుకుని, చీత్కరించుకుని దూరంగా జరుగుతారు. సాటి ఆడది అసహ్యంచుకోడానికి కారకులెవరు? నీ లాంటి పురుషులే. మమ్మల్ని ఆ సంసార జీవితం అనుభవించనివ్వకుండా ఈ బురదలోకి లాగువారు మీరేకదా? కక్షతో, గుండెల్లో మంటతో మీ మీద పగ తీర్చుకోవాలని వుంటుంది కానీ నిస్సహాయులం. ఫలితమా ఒళ్ళు కుళ్ళ బెట్టుకుంటున్నాం. తప్పుచేస్తున్నామని తెలిసి, గతిలేక మీ వంటివారి దరికెళ్ళి వదినలాంటి దేవతల్ని ఏడిపించి ఉసురు పోసుకుంటున్నాం. దీనంతటికీ కారణం ఎవరు? మీలాంటి వారే. నువ్వే - నువ్వే! వెళ్ళన్నయ్యా. వెళ్ళిపో. నేనింక ఎక్కడికిరాను. నా జీవితం ఇంక ఇలా అంతం కావాలి నేను బ్రతికేదింక కొద్దినెలలే నాకే మందువద్దు. దయచేసి వెళ్ళిపో. నన్ను తీసుకెళ్ళి జీవితాన్ని చక్కదిద్దాలని నువ్వు కోరుకున్నా అది ఎంత అసంభవమో, ఎంత నిరర్ధకమో నాకు తెలుసు. నావల్ల నాకుంటుబానికే కాక నీకు మచ్చ ఏర్పడుతుంది. శీలం చెడిన మీనాక్షిగా ఎవ్వరూ గౌరవించరు. భోగందానిగానే చూస్తారు రాళ్ళల్లాంటి మాటలురువ్వి పాత గాయాన్ని రేపుతారే తప్ప మాననివ్వరు. నన్ను వివాహం చేసుకుని సంసార జీవితాన్ని ప్రసాదించడానికి ముందుకువచ్చే వాడెవ్వడూ వుండడు. మా వంటి వారికి ఈ దేశంలో విలువ ఇంతే.

"అదే నువ్వు బాగుపడితే లోకం సంతోషిస్తుంది. ఎంతో గౌరవిస్తుంది. వదిన సాదరంగా ఆహ్వానిస్తుంది. బంధువులు. స్నేహితులు చక్కబడ్డందుకు

మెచ్చుకుంటారు. నీ పాత చరిత్ర మట్టిలో కలిసిపోయి అన్యోన్యంగా బ్రతుకుతారు.

"వెళ్ళిపో అన్నయ్యా! నాగుండెల్లో రగిలిన మంటని చల్లార్చుకుందామని నిన్ను పిలిపించా. నా కడుపులో ఉడుకుతున్న బాధల్ని నీతో చెప్పుకుని తేలిక అవుదామని నిన్ను రమ్మన్నానంతే. ఇకనైనా నీవు మంచి మార్గాన్ని ఎన్నుకుని వదినతో హాయిగా జీవించు. చివరగా నాది ఒక్కకోరిక - నా బిడ్డని ఒక కులట కూతురిగా కాకుండా వున్నత కుటుంబీకురాలిగా తీర్చిదిద్దాలన్న ఆశతో దాని జీవితాన్ని పవిత్రమైన స్త్రీ జీవితంలా మలచాలన్న కోరికతో నిన్ను కోరేది ఒక్కటే. దానిని నీతో తీసుకెళ్ళి వదినకి అభ్యంతరం లేకపోతే నీ కోడలిగా చేసుకుని నన్ను దానిలో చూసుకో అన్నయ్యా" అంటూ మంచం మీద కప్పివున్న దుప్పటి తీసి రెండేళ్ళ పాపని అన్నగారి చేతిలో పెట్టి, మంచం మీదకి వెళ్ళి బోర్లా పడుకుని, వెక్కి, వెక్కి ఏడ్వసాగింది మీనాక్షి.

అచేతనంగా నిలబడి వింటున్న రాజా చెల్లెలి బిడ్డని అందుకుని ఏడుస్తున్న చెల్లెలి పక్కకి వెళ్ళేడు.

"క్షమించు మీనాక్షీ! క్షమించు, నా తప్పుల్ని నేను తెలుసుకోలేదు. నా జీవితమంతా నాశనం అయ్యాకా తెలుసుకున్నాను క్షమించమ్మా! క్షమించు!" అన్నాడు వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

పది నిమిషాలు గడిచాయి. మీనాక్షి ఇంకా ఏడుస్తునే వుంది. ఓదార్చే ధైర్యంలేదు రాజాకి. గడియారం వైపు చూశాడు. రెండు దాటింది. పౌర్ణిమ రాత్రి అవడంవల్ల బైట వెన్నెల పుచ్చ పువ్వులా వుంది లేచి నిలబడి భుజం మీద చంటి పిల్లని వేసుకుని బరువుగా తలుపు వైపుకి నడిచాడు రాజా. మంచం మీదనుంచి లేచి కళ్ళు తుడుచుకుంటూ మీనాక్షి "ఎక్కడికన్నయ్యా?" అంది.

"మీ వదిన దగ్గరకమ్మా!" అంటూ తలుపు తీసుకుని గబ గబా నడిచి వెళ్లే అన్నగారివైపు కూతురివైపు కడసారిగా చూస్తూ తృప్తిగా నిట్టూర్చింది.

ఆమె నిటూర్పుల్లో అన్నావదినల జీవితాలని చక్కదిద్దానన్న ఆనందం కూతురికి మంచి భవిష్యత్ ఏర్పడిందన్న సంతోషం. ఇంక మళ్ళీ వారిని చూడబోనన్న విచారం మిళితమై వున్నాయి. ❊

**(1.1.1981 ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక)**